యాదగిరిగుట్టలో కార్తిక సోమవారం పూజలు

దీపారాధనలో పాల్గొన్న మహిళలు

యాదగిరిగుట్ట, నవంబర్ 11 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్య క్షేత్రంలో కార్తిక మాసం రెండో సోమవారం హరి హర ఆరాధనలు వైభవంగా జరిగాయి. మొక్కు పూజలు, దీపారాధనలతో కొండపైన ప్రధానాలయం, శివాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన అత్యంత వైభవంగా జరిపారు. సాయంత్రం స్వామివారికి వెండి మొక్కు జోడుసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. అనుబంధ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.28,92,444 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

యాదగిరిగుట్ట ఆలయ పెండింగ్ పనుల పరిశీలన

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో పెండింగ్‌లో ఉన్న పనులను ఆర్ అండ్ బీ బిల్డింగ్ ఈఈ రాజేశ్వర్‌రెడ్డి వైటీడీఏ అధికారులతో కలిసి సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కొండపై స్వామివారి ఆలయం, మాఢవీధుల్లో దక్షిణ ప్రాంతంలో కుంగిన ప్రదేశంతోపాటు కొండ కింద అన్నదాన సత్రం, ఎంట్రీ ఫ్లై ఓవర్, దేవస్థానం బస్టాండ్‌ను పరిశీలించారు. ఇంకా మిగిలి ఉన్న పనులను పరిశీలించి నివేదిక సిద్ధం చేయనున్నట్లు వైటీడీఏ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైటీడీఏ ఎస్ఈ వసంతనాయక్, ఈఈ సునీల్, ఏఈ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

మత్స్యాద్రిపై విశేష పూజలు

మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కొండపై విశేష పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

వలిగొండ, నవంబర్ 11 : మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం కొండపై స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు సోమవారం వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, యాగశాఖల ప్రవేశం, చతుస్థానార్చన, అగ్నిప్రతిష్ఠ, ద్వారాతోరణం, ధ్వజకుంభ ఆరాధన, మూర్తికుంభారాధన, నిత్యాహోమాలు, పూర్ణాహుతి, ధ్వజారోహణం, బలిహరణం, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి తదితర విశేష పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మోహన్‌బాబు, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పరామర్శ

యాదగిరిగుట్టలో మృతురాలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, నవంబర్ 11 : పట్టణానికి చెందిన సుడుగు గౌరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి సోమవారం ఆమె ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యాన్ని నింపారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, మైలారిగూడెం పాల సంఘం చైర్మన్ మారెడ్డి కొండల్‌రెడ్డి, నాయకులు ఆవుల సాయి ఉన్నారు.

పాండాల మహేశ్వర్‌కు ప్రతిభా పురస్కారం

మహేశ్వర్‌గౌడ్‌ను మెమెంటోతో సత్కరిస్తున్న ప్రముఖ కవి ఓలేటి పార్వతీశం

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 11 : తెలుగు సాహిత్య కళాపీఠం 14వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న ప్రముఖులకు విశిష్ట ప్రతిభా పురస్కారం ప్రదానం చేశారు. భూదాన్ పోచంపల్లి మోడల్ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహిస్తూ సాహిత్య సేవలో సమాజ ఉన్నతికి కృషి చేస్తున్న డాక్టర్ పాండాల మహేశ్వర్‌గౌడ్‌కు తెలుగు సాహిత్య కళాపీఠం ప్రతిభ పురస్కారం-2024 ప్రకటించింది. ఈ అవార్డును ప్రముఖ తెలుగు కవులు ఓలేటి పార్వతీశం, చిక్క రామదాసు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. కార్యక్రమంలో కవులు బతుకమ్మ రాజశేఖర్, ఈటెల సమ్మన్న, పట్టాల అశోక్, బద్దం నరసింహ గౌడ్, మౌనశ్రీ మల్లిక, కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

గురుకుల జోనల్ స్థాయి క్రీడలు ప్రారంభం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జోనల్ స్థాయి ఆఫీసర్ సక్రూనాయక్

రాజాపేట, నవంబర్ 11 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాజాపేట గురుకులంలో నిర్వహిస్తున్న పదవ జోనల్ స్థాయి క్రీడలను జోనల్ ఆఫీసర్ బి.సక్రూనాయక్, ఎస్.విద్యారాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి మహనీయుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. జాతీయ గీతం ఆలపించి జాతీయ ఒలింపిక్స్, సొసైటీ జెండాలను ఎగురవేశారు. బాలుర విభాగంలో ఈ నెల 14వరకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీవితంలో గెలుపోటములు సహజమని, ఓటమి రేపటి విజయానికి తొలిమెట్టు అని అన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్ రమేశ్, ఎస్ఐ ఉపేందర్‌యాదవ్, ప్రిన్సిపాల్ పి.సుధాకర్, డీసీఓ జగదీశ్వర్‌రెడ్డి, క్రీడల సమన్వయకర్త జి.శ్రీనివాస్, పీడీ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ రాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లిలో ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి, నవంబర్ 11 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ హన్మంతరావు అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకొచ్చి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. అదేవిధంగా సమగ్ర సర్వేను పరిశీలించి పొరపాట్లకు తావు లేకుండా సర్వేను పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ దేశ్యా, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, ఆర్ఐ జహంగీర్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈఓ సస్పెన్షన్

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్లు, జాలీ మిషన్, ట్యాబ్ అందుబాటులో లేకపోవడం, పీఏసీఎస్ పరిధిలో ట్యాబ్ ఎంట్రీ చేయకుండా విధులకు గైర్హాజర్ అయిన పీఏసీఎస్ సీఈఓ జలంధర్‌ను సస్పెండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సింహ ఉన్నారు.

సర్వే మార్గదర్శకాలు పాటించాలి

భువనగిరి అర్బన్ : ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పట్టణంలో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. సర్వే షీట్‌లో ఎన్యూమరేటర్ సేకరించిన కుటుంబ వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అన్ని కుటుంబాల వివరాల సేకరణ సమగ్రంగా చేయాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు. ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కలాం ఆశయాలను సాధించాలి : కలెక్టర్ హనుమంతరావు

భూదాన్ పోచంపల్లి : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు

భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 11 : దేశ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని, ఆయన అడుగుజాడల్లో నేటి యువత పయనించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆజాద్ 135వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారతరత్న, కేంద్ర తొలి విద్యా శాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ 11 ఏండ్లు విద్యాశాఖ మంత్రిగా ఎనలేని సేవలు అందించారన్నారు. రచయితగా, కవిగా, తత్వవేత్తగా, విద్యావేత్తగా, రాజకీయవేత్తగా అనేక సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అబుల్ కలాం ఆజాద్ అని కీర్తించారు. ఆయన మైనార్టీ వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా అబుల్ కలాం పుట్టిన రోజు సందర్భంగా నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గంగాధర్, భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి యాదయ్య, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జైపాల్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్‌ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆజాద్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

రామన్నపేట : దేశ మొట్టమొదటి విద్యా శాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రహ్మత్‌ఖానమ్ అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు, అధ్యాపకులు చిన్నబాబు, వెంకటేశ్వర్లు, కరాణాకర్, రవీందర్‌రావు పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని అంకిరెడ్డిగూడెం మైనారిటీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిలో ప్రిన్సిపాల్ బాలకృష్ణ మాట్లాడారు. విద్య సమాజ మార్పునకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, మస్తాన్‌అలీ, సరిత, విజయలక్ష్మి, సైదయ్య, వెంకన్న పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.సురేశ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జ్యోతి, అధ్యాపకులు తులసి, రాజేశ్వరమ్మ, మంజుల, సంతోష్, వెంకటేశ్, శివశంకర్, వెంకట్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి

ఆలేరు టౌన్, నవంబర్ 11 : డీసీఎం డివైడర్‌ను ఢీకొని వాగులో పడిన డ్రైవర్ వెంకటసీతారాం (40) అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ కె.రజనీకర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన వెంకటసీతారాం సోమవారం సాయంత్రం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు డీసీఎంతో వస్తున్నాడు. బహద్దూర్‌పేట సమీపంలోని ఈదులవాగు వంతెనపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ వెంకటసీతారాం ఎగిరి వాగులో పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, ప్రమాదానికి గల కారణాలను సేకరిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సాయి మెటల్ మర్చంట్ షాపులో అగ్నిప్రమాదం

సాయి మెటల్ మర్చంట్ షాపులో ఎగిసిపడుతున్న మంటలు

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 11 : పట్టణంలోని సాయి మెటల్ మర్చంట్ షాపులో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగగా.. పక్కన ఉన్న దుకాణదారులు, గ్రామస్తులు ఆర్పేందుకు ప్రయత్నించారు. దుకాణంలో ఉన్న వస్తువులను బయటకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి పక్కన ఉన్న పెట్రోల్ బంకు నుంచి ఫైర్ సిలిండర్ తీసుకొచ్చి మంటలు ఆర్పేశారు. అప్పటికే సుమారు రూ.4లక్షల విలువైన పరుపులు, బీరువాలు, ఇతర ఫర్నిచర్ దగ్ధమయ్యాయి. తాసీల్దార్ మహేందర్‌రెడ్డి షాపును పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, దుకాణం యజమాని ద్యానబోయిన జంగయ్య, వేముల సుమన్ పాల్గొన్నారు. రేవణపల్లి గ్రామంలో మణికంఠ జ్యువెలర్ వర్క్‌షాపులో పనిచేస్తుండగా సిలిండర్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. షాపు అద్దాలు పగిలిపోగా, కొన్ని వస్తువులు కాలిపోయాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

రాజాపేట, నవంబర్ 11 : మండలంలోని పారుపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి.. జనగాం జిల్లా నెర్మడ మండలం వెల్దండ గ్రామానికి చెందిన గుండెల్లి జహంగీర్‌రెడ్డి తన షిఫ్ట్ డిజైర్ కారులో మండలంలోని రేణిగుంటలో ఉన్న తన చెల్లెలు ఇంటికి వచ్చాడు. ఆమెను తీసుకొని ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో కారులో మంటలు వచ్చాయి. గమనించిన జహంగీర్‌రెడ్డి వెంటనే అప్రమత్తమై కిందికి దిగారు. దీంతో ఎలాంటి ప్రాణాపాయం కలుగలేదు. కారు పూర్తిగా కాలిపోయింది.

ధాన్యం కొనుగోళ్లలో నాణ్యత పాటించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మోత్కూరు : పాటిమట్ల ఐకేపీ సెంటర్‌లో ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

మోత్కూరు, నవంబర్ 10 : నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో, పాటిమట్ల ఐకేపీ కేంద్రంలో ధాన్యం రాశులను, మోత్కూరులోని పరమేశ్వర మిల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం తూకాలు చేసి వెంటనే ఎగుమతి జరిగేలా చూడాలన్నారు. ఈ మేరకు సివిల్ సప్లయ్ అధికారులతో, రైస్ మిల్లర్లతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, తాసీల్దార్ రాంప్రసాద్, ఏఓ కీర్తి, ఏఈఓలు పాల్గొన్నారు.

తిరుమలాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తుర్కపల్లి : తిరుమలాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చైతన్య

తుర్కపల్లి, నవంబర్ 11 : మండలంలోని తిరుమలాపురం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆలేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఐనాల చైతన్యామహేందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహారెడ్డి, తాసీల్దార్ దేశ్యా, ఎంపీడీఓ ఝాన్సీలక్ష్మీబాయి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పోరెడ్డి మాధవి, చాడ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని సబ్‌మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాసీల్దార్ రవికుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ మల్లికార్జున్‌రావు, ఏఓ అరుణకుమారి, ఏఈఓ మనీషా, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు అరుణ, సంధ్య పాల్గొన్నారు.

'తక్షణమే ఫీజు బకాయిలు విడుదల చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న మోదీరాందేవ్

చౌటుప్పల్, నవంబర్ 11 : విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయకపోతే సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగోర్ల మోదీరాందేవ్ అన్నారు. పట్టణంలోని గాంధీ పార్కు వద్ద సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇవ్వడానికి రూ.7వేల కోట్లు ఉండవు కానీ.. మూసీ ప్రక్షాళన రూ.50వేల కోట్లు ఉంటాయా? అని ప్రశ్నించారు. గురుకులంలో మెరుగైన వసతులు లేక ఇప్పటికి 75మంది విద్యార్థులు చనిపోయారని తెలిపారు. తక్షణమే హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న 2.50లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, నాయకులు హరి కృష్ణ, వీరేందర్, మహదేవ్, నిఖిల్, భాస్కర్, మణికంఠ, ఉదయ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

చౌటుప్పల్ మార్కెట్ యార్డులో ధాన్యం పరిశీలిస్తున్న ఎంపీ కె.లక్ష్మణ్

చౌటుప్పల్, నవంబర్ 11 : ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డు, జైకేసారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యల గురించి కలెక్టర్, తాసీల్దార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే మూసీ ప్రక్షాళన కాదు.. రైతుల కష్టాలు చూడాలని సూచించారు. బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్ గౌడ్, నాయకులు వీరారెడ్డి, భిక్షంగౌడ్ శంకర్, గోవర్ధన్‌రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు : ఎమ్మెల్యే వీరేశం

ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, నవంబర్ 11 : దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని ఎన్నారం గ్రామంలో రూ.40లక్షలతో నిర్మించనున్న సీతా రామాంజనేయస్వామి ఆలయ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలన్నారు. దేవాలయ పునర్నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, ఆలయ చైర్మన్ ఏనుగు దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కక్కిరేణి ఎల్లమ్మ, మాజీ సర్పంచ్ లక్ష్మీకాంత రావు, నాయకులు పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ

సమావేశంలో మాట్లాడుతున్న చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ

భూదాన్ పోచంపల్లి, నవంబర్ 11 : చేనేత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మ అన్నారు. పట్టణంలోని పద్మశాలి చేనేత కార్మిక సంఘం భవనంలో సోమవారం కార్మికుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ముద్ర లోన్లు, ఇతర రుణాలు తీసుకున్న చేనేత కార్మికులకు బ్యాంకుల్లో త్రిఫ్ట్ డబ్బులు ఇవ్వడం లేదని, మొండి బకాయిలు అయినందున నగదును పట్టుకున్నారని కార్మికులు తెలిపారు. ప్రభుత్వం చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్మికులందరికీ డబ్బులు ఇప్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. బ్యాంకు మేనేజర్లతో సంప్రదించి కార్మికుల డబ్బులు ఖాతాలో త్వరగా వేయాలని అధికారులకు సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారుల అభిరుచుల మేరకు నాణ్యత, నవ్యతతో వస్త్రాలు తయారు చేయాలని చేనేత కార్మికులకు సూచించారు. అనంతరం చేనేత సహకార సంఘంలో ఆమెను సత్కరించారు. సమావేశంలో చేనేత జౌళి శాఖ ఇన్‌చార్జి ఏడీ శ్రీనివాస్‌రావు, పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, ఉపాధ్యక్షుడు భారత భూషణ్, ప్రధాన కార్యదర్శి బొమ్మ హరిశంకర్, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, రాష్ట్ర నాయకుడు ఏలే భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి

- జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ

సమావేశంలో మాట్ల